‘పంట సిరి’తో ఆదాయం..!

- సెగ్రిగేషన్ షెడ్లలో వర్మీ కంపోస్ట్ తయారీ
- తక్కువ ధరకే రైతులకు విక్రయం
- మండలంలో 20 గ్రామ పంచాయతీలు



వర్మీ కంపోస్ట్ ఎరువు



రైతులకు వర్మీ కంపోస్ట్ విక్రయిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

కౌటాల: గ్రామీణ ప్రాంతాలతో పాటు పట్టణాల్లో గతంలో ఎక్కడ పడితే అక్కడ చెత్త వేసేవారు. దీంతో అనేక సమస్యలు ఉత్పన్నమయ్యేవి. సమస్యకు చెక్ పెట్టేందుకు ప్రభుత్వం చెత్త సేకరణ కోసం ప్రత్యేక వాహనాలు ఏర్పాటు చేసింది. ఇంటి వద్దకే వచ్చిన చెత్త బండిలో సేకరించిన చెత్తను ఒకచోటకు తరలించి తడి, పొడి చెత్తగా వేరు చేస్తున్నారు. వేరు చేసిన చెత్తతో వర్మీ కంపోస్ట్ ఎరువు తయారు చేస్తున్నారు. తయారు చేసిన ఎరువును పంట సిరి పేరుతో రైతులకు రూ.100కు మూడు కిలోల బస్తా చొప్పున విక్రయిస్తున్నారు. దీంతో జీపీలకు ఆదాయం సమకూరుతుంది. హరితహారం నర్సరీల్లో, ప్రకృతి వనాల్లోని మొక్కలకు సైతం ఈ ఎరువునే వినియోగిస్తున్నారు.

జీపీలకు ఆదాయం

మండలంలోని 20 గ్రామ పంచాయతీల్లో వర్మీ కంపోస్ట్ తయారు చేస్తున్నారు. ఇప్పటి వరకు మండలంలోని గ్రామ పంచాయతీల్లో 30 క్వింటాళ్ల వరకు వర్మీ కంపోస్ట్ తయారు చేయగా అందులో కొంత రైతులకు విక్రయించి పంచాయతీలకు ఆదాయం సమకూరేలా చర్యలు చేపట్టారు. ఇప్పటి వరకు జీపీలకు సుమారు రూ. 50వేల వరకు ఆదాయం సమకూరినట్లు సంబంధిత మండల అధికారులు తెలిపారు.

తయారీ విధానం

గ్రామాల్లో సేకరించిన చెత్తను సెగ్రిగేషన్ షెడ్‌లో తడి, పొడి చెత్తగా పారిశుధ్య సిబ్బంది వేరు వేస్తారు. కూరగాయల వేస్టేజీ, కోళ్ల వ్యర్థాలు, కుళ్లిపోయిన తినుబండారాలతో సేంద్రియ ఎరువు తయారు చేసేందుకు పెద్ద అరను ఏర్పాటు చేశారు. అరల్లో చెత్తతో పాటు వాన వాములు వదిలి దానిపై మట్టితో పాటు పేడ కప్పుతారు. అనంతరం పేడ నీటిని పోసి కొన్ని రోజులు అలాగే ఉంచితే ఎరువుగా మారుతుంది. కౌటాలలో వర్మీ కంపోస్ట్ తయారు చేస్తుండడంతో జిల్లా ఉన్నతాధికారులు సైతం మండల అధికారులను అభినందిస్తున్నారు.

అదనపు ఆదాయం



చెత్త సేకరించి సెగ్రిగేషన్ షెడ్లకు తరలిస్తున్నాం. అనంతరం తడి, పొడి చెత్తను వేరు చేసి వర్మీ కంపోస్ట్ ఎరువు తయారీకి వినియోగిస్తున్నాం. వర్మీ కంపోస్ట్ తయారు చేసి పంట సిరి పేరుతో రైతులకు రూ. 100లకు మూడు కిలోల ఎరువు బస్తాను అందిస్తున్నాం. పంచాయతీలకు అదనపు ఆదాయం వస్తుంది.

– కాసు కళ, పంచాయతీ కార్యదర్శి, కౌటాల

వర్మీ ఎరువుతో దిగుబడులు



వర్మీ కంపోస్ట్ ఎరువుతో అనేక ఉపయోగాలు ఉన్నాయి. వర్మీ కంపోస్ట్‌ను వినియోగించడంతో భూసారం పెరగడంతో పాటు పంటల్లో మంచి దిగుబడి వస్తుంది. పంట ఉత్పాదక సామర్థ్యాన్ని పెంచడంతో పాటు పంట నాణ్యత పెరుగుతుంది. పండ్ల తోటలు, మొక్కలు, పంటలకు వర్మీ కంపోస్ట్ వినియోగించాలి.

– పి. రాజేశ్, ఏవో, కౌటాల

అన్ని జీపీల్లో తయారీ



వర్మీ కంపోస్ట్‌తో రైతులకు అధిక లాభాలున్నాయి. మండలంలోని గ్రామ పంచాయతీల్లో చెత్త ద్వారా వర్మీ కంపోస్ట్ తయారు చేయిస్తున్నాం. ప్రజలు చెత్త బయట వేయకుండా చెత్త బండిలో వేయాలని అవగాహన కల్పిస్తున్నాం. ఇప్పటి వరకు పంచాయతీలకు రూ.50 వేల వరకు ఆదాయం వచ్చింది.

– నస్రుల్లాఖాన్, ఎంపీడీవో, కౌటాల

క్లుప్తంగా

వాలీబాల్ టోర్నమెంట్ ప్రారంభం

పెంచికల్‌పేట్: మండలంలోని మురళీగూడ గ్రామంలో కోనేరు చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వాలీబాల్ టోర్నమెంట్‌ను మంగళవారం సర్పంచ్ ఈశ్వరీబాయి, ఎంపీడీవో గంగాసింగ్ ప్రారంభించారు. వారు మాట్లాడుతూ క్రీడలతో స్నేహభావం పెంపొందుతుందన్నారు. యువత చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని కోరారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ ప్రభాకర్, కార్యదర్శి శాంతయ్య, నాయకులు బాపు, వెంకటి, నిర్వాహకులు లచ్చిరాం, సంతోష్, మధుకర్, గురుదాస్, హన్మంతు తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీ యువతకు ఉచిత ఆన్‌లైన్ సేవలు

ఆసిఫాబాద్: తెలంగాణ రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా అమలు చేస్తున్న ఎకనావికల్ సపోర్ట్ పథకానికి జిల్లాలోని మైనార్టీ యువతీ, యువకులకు ఏఐఎంఐఎం ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత హెల్ప్‌లైన్ సెంటర్ ద్వారా ఉచిత ఆన్‌లైన్ సేవలు అందిస్తున్నట్లు పార్టీ పట్టణ అధ్యక్షుడు ఎండీ సల్మాన్ తెలిపారు. మంగళవారం జిల్లా కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలోని 100కు పైగా యువతీ యువకులకు ఉచిత ఆన్‌లైన్ సేవలందించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు మీర్ కౌశిష్ అలీ హష్మీ, షేక్ ఆరిఫ్, షకీల్ అహ్మద్, మహ్మద్ పాషా, షభాజ్, ఐమాన్, ఆముది సయ్యద్, తమీమ్ అలీ పాల్గొన్నారు.

బాలలను పనిలో పెట్టుకోవద్దు

దహెగాం: బడీడు పిల్లలను పనిలో పెట్టుకోవడం నేరమని ఆపరేషన్ స్మైల్ ఎస్సై ఎమ్.సర్కార్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని వారసంతలో దుకాణాలను తనిఖీ చేశారు. అనంతరం వ్యాపారులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ 18 సంవత్సరాల లోపు పిల్లలను పనిలో పెట్టుకోవద్దన్నారు. బాలలతో పని చేయిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిబ్బంది అమీర్ పాల్గొన్నారు.

టీయూటీఎఫ్ క్యాలెండర్ల ఆవిష్కరణ

తిర్యాణి: టీయూటీఎఫ్ క్యాలెండర్లను మంగళవారం మండల కేంద్రంలోని ఆశ్రమ పాఠశాలలో ఆవిష్కరించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు కోట్నాక ప్రవీణ్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలపై తమ సంఘం అనేక నిరసన కార్యక్రమాలు చేపడుతుందన్నారు. ఉపాధ్యాయులు జగ్గరావు, పర్వత్‌రావు, సంపత్ తదితరులు ఉన్నారు.

రోడ్డు మరమ్మతులు చేపట్టాలి

ఆసిఫాబాద్‌రూరల్: వర్షాకాలంలో దెబ్బతిన్న రోడ్డు మరమ్మతులు చేపట్టాలని ఎంపీపీ మల్లికార్జున్ అన్నారు. మంగళవారం మండలంలోని మోవాడ్, వెంకటపూర్ గ్రామాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాల కారణంగా మట్టి కొట్టుకుపోయి గుంతలు ఏర్పడిన రోడ్డుకు మట్టివేసి మరమ్మతులు నిర్వహించాలని సర్పంచ్‌లకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో శశికళ, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికత అలవర్చుకోవాలి

వాంకిడి: ప్రతీ ఒక్కరూ ఆధ్యాత్మికత అలవర్చుకోవాలని జెడ్పీటీసీ అజయ్ కుమార్ అన్నారు. మంగళవారం మండలంలోని నార్లపూర్ గ్రామంలోని పులాజీబాబా 9వ వార్షికోత్సవం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం జెడ్పీటీసీ మాట్లాడుతూ ధ్యాన మందిరాల అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. పులాజీ బాబా కుమారుడు కేశవ్‌రావు, సర్పంచ్ కమలాకర్ ఉన్నారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ



ప్రతిభ కనబర్చిన విద్యార్థులు

కౌటాల: మండల కేంద్రంలోని మయూరి విద్యాలయం విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబర్చినట్లు పాఠశాల కరస్పాండెంట్ యాదగిరి మంగళవారం తెలిపారు. ఈ నెల 6, 7, 8వ తేదీల్లో తెలంగాణ అసోసియేషన్ ఫర్ ఇంటర్నేషనల్ స్పోర్ట్స్ ఫర్ ఆల్ నిర్వహించిన థర్డ్ తఫీసా రాష్ట్రస్థాయి పోటీల్లో పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చినట్లు తెలిపారు. కబడ్డీ, ఖోఖో పోటీల్లో ప్రథమ బహుమతి, బాక్సింగ్‌లో ద్వితీయ బహుమతి పొందినట్లు తెలిపారు. పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులను హెచ్‌ఎం కృష్ణ, పీఈటీ నరేందర్ అభినందించారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని వినతి

ఆసిఫాబాద్‌రూరల్: ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని యూటీఎఫ్ ఆధ్వర్యంలో డీఈవో అశోక్‌కు మంగళవారం వినతిపత్రం అందజేశారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సదాశివ్, నాయకులు పాల్గొన్నారు.

‘ధరణి’ సమస్యల పరిష్కారానికి చర్యలు

- కలెక్టర్ రాహుల్‌రాజ్



మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

ఆసిఫాబాద్: ధరణి పోర్టల్ ద్వారా అందిన ప్రతీ దరఖాస్తును పరిశీలించి సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో మంగళవారం అదనపు కలెక్టర్ రాజేశం, తహసీల్దార్లతో కలిసి ధరణిపై సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ ధరణిలో వచ్చిన సమస్యల నివేదికలు రూపొందించి పరిష్కారం చేపట్టే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. భూ సమస్యలపై రికార్డులను పరిశీలించి తప్పులకు తావివ్వకుండా వెంటనే నివేదికలు అందించాలని తహసీల్దార్లను ఆదేశించారు. నివేదికలు సమగ్రంగా, స్పష్టంగా ఉండేలా చూసుకోవాలని సూచించారు. సమావేశంలో డీఆర్వో రాజేశ్వర్ పాల్గొన్నారు.

ఆసుపత్రి నిర్మాణ పనులు పూర్తి చేయాలి

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం జిల్లా కేంద్రంలోని బాబాపూర్ శివారులో నిర్మిస్తున్న 340 పడకల ప్రభుత్వ ఆసుపత్రి పనులను జూన్ మాసంలోపు పూర్తి చేసే విధంగా సంబంధిత అధికారులు, గుత్తేదారులు కృషి చేయాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ తెలిపారు. మంగళవారం జిల్లా అదనపు కలెక్టర్ రాజేశంతో కలిసి ఆసుపత్రి నిర్మాణ పనులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతు ప్రజల సౌకర్యార్థం ప్రభుత్వం రూ.39కోట్ల 65లక్షల వ్యయంతో 340 పడకల మూడు అంతస్తుల ఆసుపత్రి భవన నిర్మాణాన్ని చేపట్టిందని, త్వరగా పూర్తి చేసి ప్రారంభానికి సిద్ధం చేయాలని పేర్కొన్నారు.

రాష్ట్ర మహాసభలు విజయవంతం చేయండి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు

వాంకిడి: ఈనెల 13, 14 తేదీల్లో రంగారెడ్డి జిల్లాలో నిర్వహించే టీఎస్ యూటీఎఫ్ 5వ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని సంఘం నాయకులు పిలుపునిచ్చారు. రాష్ట్ర మహాసభలకు సంబంధించిన వాల్ పోస్టర్లను మంగళవారం మండల కేంద్రంలో ఆవిష్కరించారు. సంఘం మండల ప్రధాన కార్యదర్శి హరీశ్, ఉపాధ్యాయులు సాయి, శివరాజ్, మహేందర్ తదితరులు ఉన్నారు.

బెజ్జూర్‌లో..

బెజ్జూర్: టీఎస్ యూటీఎఫ్ 5వ రాష్ట్ర మహాసభల పోస్టర్లను సంఘం జిల్లా కార్యదర్శి శ్రీనివాస్ ఆవిష్కరించారు. మంగళవారం మండల కేంద్రంలో కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. దీంతోపాటు సంఘం ఆధ్వర్యంలో ముద్రించిన నూతన సంవత్సర క్యాలెండర్లను సైతం ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం తమ సంఘం ఎప్పుడు ముందుంటుందన్నారు. కార్యక్రమంలో టీఎస్ యూటీఎఫ్ బెజ్జూర్ మండల కార్యదర్శి టోనీ, కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే సమగ్ర అభివృద్ధి



సమావేశంలో మాట్లాడుతున్న అధికారి

ఆసిఫాబాద్‌రూరల్: విద్యతోనే సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని నాబార్డ్ ఫీల్డ్ అసిస్టెంట్ ప్రశాంత్ కుమార్ అన్నారు. మంగళవారం మండలంలో చిర్రకుంట గ్రామంలో వాసన్ సంస్థ వారి ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆర్థికంగా అభివృద్ధి సాధించాలంటే ప్రతీ ఒక్కరు ఉన్నత చదువులు చదవాలన్నారు. రైతులు ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వాసన్ సంస్థ సభ్యులు రవీందర్, తిరుపతి, శంకర్ రైతులు పాల్గొన్నారు.

కాటేపల్లిలో ఎమ్మెల్యే కోనప్ప పర్యటన



వివరాలు అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే

బెజ్జూర్: మండలంలోని కాటేపల్లి గ్రామంలో మంగళవారం సిర్పూర్ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప పర్యటించారు. బీఆర్‌ఎస్ పార్టీ కార్యకర్త కోర్తే లాలయ్య కుమారుడు అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొంది ఇటీవల ఇంటికి చేరుకోగా బాధితుడిని పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యేకు మహిళలు పెద్ద ఎత్తున పూలమాలలతో స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు సకారాం, మండల కోఆప్షన్ సభ్యులు బషారత్ ఖాన్, సహకార సంఘం చైర్మన్ ఓంప్రకాష్, వెంకన్న, సర్పంచ్‌లు భీంరావ్, అంజలి, రాజారామ్, నారాయణ, తులసిరామ్, అజీమ్, పెంటయ్య, రహేమత్, గుండయ్య, మల్లేష్, శ్రీహరి, సురేష్, గణపతి పాల్గొన్నారు.

ప్రతీ ఉద్యోగి అంకితభావంతో పని చేయాలి



పదోన్నతి పత్రాలు అందజేస్తున్న రాజాజీ

రెబ్బెన: ప్రతీ ఒక్క ఉద్యోగి అంకితభావంతో పని చేయాలని కైరిగూడ ప్రాజెక్టు ఇంజనీర్ రాజాజీ అన్నారు. మంగళవారం కైరిగూడ ఓసీపీలో పని చేస్తున్న పలువురు ఉద్యోగులకు జనరల్ మజ్దూర్ పదోన్నతి ఆర్డర్ కాపీలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగులందరూ తమకు కేటాయించిన విధులను రక్షణసూత్రాలు పాటిస్తూ పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో సేఫ్టీ అధికారి రాజేశ్వర్‌రావు, ఎస్ఈ నరేష్, పిట్ కార్యదర్శి వెంకటేషం, జీఎం స్ట్రక్చర్ కమిటీ సభ్యుడు వెంకటేశ్వర్లు, చంద్రశేఖర్, సంక్షేమాధికారి వేణు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు రాగి జావ పంపిణీ

కెరమెరి: మండలంలోని జిల్లా పరిషత్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఉన్నత, ప్రాథమికోన్నత, ప్రాథమిక పాఠశాలల్లో మంగళవారం రాగిజావ పంపిణీ కార్యక్రమం ప్రారంభించారు. శ్రీ సత్యసాయి అన్నపూర్ణ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచితంగా పంపిణీ చేశారు. మండలంలోని మొత్తం 56 పాఠశాలల్లోని 3400 మంది విద్యార్థులకు రాగిజావ పంపిణీ చేస్తున్నారు.

రాగి జావలో పోషకాలు

రెబ్బెన: అన్నపూర్ణ ట్రస్ట్ సహకారంతో ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు అందజేస్తున్న రాగిజావాతో విద్యార్థులకు పూర్తిస్థాయిలో పోషకాలు అందుతాయని ఇందిరానగర్ సర్పంచ్ దుర్గం రాజ్యలక్ష్మి, లేతన్‌గూడ హెచ్‌ఎం రవికుమార్ అన్నారు. మంగళవారం పాఠశాల విరామ సమయంలో విద్యార్థులకు రాగిజావా పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. విద్యాకమిటీ చైర్మన్ వెంకటమ్మ, ఉపాధ్యాయుడు సాయికృష్ణ, అంగన్‌వాడీ టీచర్ తిరుపతమ్మ పాల్గొన్నారు.

ముగిసిన జిల్లాస్థాయి క్రికెట్ పోటీలు

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని దుర్గానగర్ గ్రామపంచాయతీలో జరుగుతున్న జిల్లాస్థాయి క్రికెట్ పోటీలు మంగళవారంతో ముగిశాయి. మంగళవారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో చింతగూడ జమీర్ –11 జట్టుపై విలేజ్ నెం.8 జట్టు గెలుపొంది విజేతగా నిలిచింది. విన్నర్ జట్టుకు రూ. 25 వేలు, రన్నర్ జట్టుకు రూ.15వేల నగదు అందజేశారు. జెడ్పీ ఉపాధ్యక్షుడు కోనేరు కృష్ణారావు, ఎంపీపీ శంకర్, స్వదేశ్‌శర్మ, నిమ్మాయి మండల్, బికాస్, గీతారాణి మండల్, అనూప్, రాజు పాల్గొన్నారు.

యువత క్రీడల్లో రాణించాలి

కౌటాల: గ్రామీణ యువత క్రీడల్లో రాణించాలని బీజేపీ నాయకుడు పాల్వాయి హరీష్‌బాబు అన్నారు. మండలంలోని మొగడ్‌దగడ్ గ్రామంలో నిర్వహిస్తున్న కబడ్డీ పోటీలను మంగళవారం ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఉర్వత్ జీజాబాయి, పార్టీ జిల్లా కార్యదర్శి బండి రాజేందర్‌గౌడ్, మండల అధ్యక్షులు వానుపటేల్, నాయకులు బాజీరావు, బండు పటేల్, మిథున్, రుషి, చందు, మధుకర్, కార్తీక్ పాల్గొన్నారు.

కంకర తేలి.. కోతకు గురై!



జోడేఘాట్ సమీపంలో కోతకు గురైన రోడ్డు



కంకరతేలిన రోడ్డు



పాట్నాపూర్ సమీపంలో కోతకు గురైన రోడ్డు



బాబేఝరి పాఠశాల వద్ద రోడ్డు దుస్థితి

కెరమెరి: మండలంలోని జోడేఘాట్ రోడ్డు పరిస్థితి అధ్వానంగా మారింది. కెరమెరి నుంచి టోకెన్ మోవాడ్ వరకు కంకర తేలి నడిచేందుకు యోగ్యంగా లేకుండా పోగా.. టోకెన్ మోవాడ్ నుంచి జోడేఘాట్ వరకు బీటీ రోడ్డు నిర్మించినా రోడ్డు అంచులు పలు చోట్ల కోతకు గురయ్యాయి. దీంతో ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడం లేదు. సమస్య పరిష్కరించాలని మండలవాసులు కోరుతున్నారు.

ఎంఎస్పీ మండల కన్వీనర్‌గా రమేశ్

రెబ్బెన: ఎంఎస్పీ రెబ్బెన మండల కన్వీనర్‌గా మండలంలోని గంగాపూర్‌కు చెందిన ఇగురపు రమేశ్‌ను ఎన్నుకున్నారు. ఎంఎస్పీ జాతీయ ఉపాధ్యక్షుడు ఎండీ రజీ హైదర్, ఉమ్మడి జిల్లా కన్వీనర్ రేగుంట కేశవ్‌రావు మాదిగ మంగళవారం రమేశ్‌ను మండల కన్వీనర్‌గా నియమించారు.

భక్తిశ్రద్ధలతో అంగారిక చతుర్థి

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలోని బ్రాహ్మణవాడలోని శ్రీ గణేష్ మందిర్‌లో మంగళవారం అంగారిక చతుర్థిని పురస్కరించుకొని ఆలయంలో సాయంత్రం 6 గంటలకు స్వామి వారికి అర్చకులు శ్రీనివాస్‌శర్మ, ఒజ్జల శిరీష్‌శర్మ, ఢిల్లీ విజయ్‌కుమార్‌శర్మల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. అంగారిక చతుర్థి సందర్భంగా ఆలయంలో స్వామివారికి గణపతి అష్టోత్తర శత నామావళి, పుష్పార్చన, అభిషేకం, మంగళ హారతి, మహా మంత్రపుష్పాన్ని నిర్వహించారు. అనంతరం తీర్థప్రసాద వితరణ నిర్వహించారు. చతుర్థి ఉపవాస దీక్షలు చేపట్టిన భక్తులు రాత్రి 8.40 గంటలకు చంద్రోదయం తర్వాత దీక్ష విరమించారు.

21న ఉద్యమకారుల సంఘ సమావేశం

కాగజ్‌నగర్‌టౌన్: హైదరాబాద్‌లో ఈ నెల 21న 1969 తెలంగాణ ఉద్యమకారుల సంఘం సమావేశం నిర్వహించనున్నట్లు ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మార్త సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. కార్యనిర్వాహక సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు చక్రహరి రామరాజు, మాజీ మంత్రి మాచినేని కిషన్‌రావు, మాజీ ఎమ్మెల్సీ సుదర్శన్‌రావు, తొలిదశ ఉద్యమ నాయకులు పాల్గొని విస్తృత చర్చల అనంతరం రవీంద్రభారతిలో 21వ తేదీన 3 గంటలకు అన్ని ప్రతిపక్ష నాయకులతో సర్వసభ్య సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. 1969 తెలంగాణ ఉద్యమకారులను స్వాతంత్ర్య సమరయోధులుగా గుర్తించాలని, పెన్షన్ సౌకర్యం కల్పించాలని, ఉచిత వైద్యం అందించాలని, ఉద్యమకారుల పిల్లలకు రిజర్వేషన్‌లు కల్పించాలని డిమాండ్ చేశారు.

గ్రామాలు అభివృద్ధి చెందాలి



మాట్లాడుతున్న సురేష్‌బాబు

కౌటాల: గ్రామాలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని డీఎల్‌పీవో సురేష్‌బాబు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని రైతువేదిక భవనంలో పంచాయతీ కార్యదర్శులు, ఏఈవోలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఉన్న వనరులను వినియోగించి జీపీల ఆదాయం పెంచాలన్నారు. గ్రామాల్లో సబ్‌కా యోజన సబ్‌కి వికాస్ కోసం కృషి చేయాలని తెలిపారు. గ్రామాల్లో సర్పంచులు, ప్రజాప్రతినిధులకు పథకాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

కార్యక్రమంలో ఎంపీడీవో నస్రుల్లాఖాన్, ఎంపీవో సుధాకర్‌రెడ్డి, ఏవో రాజేశ్, తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ అభ్యర్థుల జీవితాలతో ఆడుకోవద్దు



నిరసన తెలుపుతున్న డీవైఎఫ్‌ఐ నాయకులు

రెబ్బెన: రాష్ట్ర ప్రభుత్వం పోలీస్ అభ్యర్థుల జీవితాలతో చెలగాటం ఆడటం సరికాదని డీవైఎఫ్‌ఐ మండల అధ్యక్షుడు చాపిడి పురుషోత్తం అన్నారు. ఎస్సై, కానిస్టేబుల్ అభ్యర్థుల సమస్యలను పరిష్కరించాలని చేపట్టిన చలో ప్రగతిభవన్ ముట్టడికి వెళ్లిన విద్యార్థి యువజన సంఘాల నాయకులు, కార్యకర్తలను అరెస్టు చేయటాన్ని నిరసిస్తూ మంగళవారం రెబ్బెనలో ప్లకార్డులతో నిరసన తెలిపారు. కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి శివ, నాయకులు మహేష్ పాల్గొన్నారు.